



ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్ద మెడికల్ క్యాంపు

ప్రాణం కోసం

- ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదం జరిగి 8 రోజులు
- 24/7 అధికారులందరూ అక్కడే
- సహాయక చర్యల్లో 18 విభాగాలు
- 54 మంది ఉన్నతాధికారులు, 703 మంది సిబ్బంది



ఎస్ఎల్‌బీసీ టన్నెల్ లోపలికి రెస్క్యూ సిబ్బందిని తీసుకెళ్తున్న లోకో ట్రైన్



అధికారులతో ఫోన్ ద్వారా వివరాలు తెలుసుకుంటున్న మంత్రులు జూపల్లి కృష్ణారావు, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, చిత్రంలో అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ

నాగర్‌కర్నూల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎల్ బీసీ టన్నెల్ (శ్రీశైలం ఎడమ గట్టు కాలువ సొరంగం)లో ప్రమాదం చోటు చేసుకుని నేటికీ వారం రోజులు పూర్తయ్యాయి. వందల మంది కార్మికులు, వివిధ విభాగాలకు చెందిన 54 మంది ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు సొరంగం కుప్పకూలిన సంఘటన నుంచి 8 మందిని బయటకు తెచ్చేందుకు అహోరాత్రులు పని చేస్తున్నారు. ప్రతీరోజు ఉదయం 7గంటలకు సహాయక సిబ్బంది, ఉన్నతాధికారులు, మీడియా ప్రతినిధులందరూ టన్నెల్ ముఖద్వారం చేరుకుని లోపల ఉన్న 8 మంది యోగక్షేమాలు తెలుసుకోవడానికి ఆత్రుత పడుతున్నారు. మూడు షిఫ్టులల్లో ఆర్మీ, సింగరేణి, నేవీ, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు లోపలికి వెళ్తున్న క్రమంలో అందరి కళ్లల్లో గంటల కొద్ది నిరీక్షణ కన్పిస్తోంది. లోపలికి వెళ్లిన సహాయక సిబ్బంది బయటకు వచ్చిన వెంటనే టన్నెల్ లోపల చిక్కుకున్న వారి యోగ క్షేమాలు తెలుసుకోవడానికి అధిక సమయాన్ని కేటాయిస్తున్నారు. సహాయక చర్యల సిబ్బంది కళ్లల్లో ఆనందం కన్పిస్తే లోపల ఉన్న వాళ్లు క్షేమంగా ఉన్నట్లే అని భావిస్తున్న ప్రతీ ఒక్కరు వచ్చిన వారంతా నిరాశగా వెను తిరగడంతో వారి ఆశలు ఆవిరి అవుతున్నాయి. గత శనివారం ఉదయం 8:30 గంటల సమయంలో టన్నెల్ లోపల ప్రమాదం చోటు చేసుకున్న విషయం తెలిసిందే. చాలా మంది కార్మికులు టన్నెల్ తవ్వకం పనులకు హాజరు కావడం, టీబీఎం మిషన్ వెనక భాగంలో ఉన్న వాళ్లంతా ప్రమాదాన్ని పసిగట్టి వెనక్కి పరిగెత్తుకుంటూ వచ్చారు. ఈ సంఘటనలో గురుప్రీత్ సింగ్, సన్నీసింగ్, మనోజ్‌కుమార్, శ్రీనివాస్, సందీప్‌సాహు, అనూజ్‌సాహు, జగ్త్యాసెస్, సంతోష్ సాహు టన్నెల్లో చిక్కుకున్నారు. ఆక్సిజన్ కూడా అందని ప్రాంతం, అడుగు తీసి అడుగు వేస్తే తమ ప్రాణాలు ఎక్కడ పోతాయోనన్న ప్రమాదం అయినా సరే ఆ 8 మందిని రక్షించాలని తపన, తాపత్రయం ఆర్మీ, నేవీ, సింగరేణి కార్మికుల్లో కన్పిస్తోంది. ప్రమాదం చోటు చేసుకున్న నాటి నుంచి ఎన్‌డీఆర్ఎఫ్‌కు చెందిన 120 మంది, ఎస్ డీఆర్ఎఫ్ సిబ్బంది 101 మంది, ఆర్మీ ఇంజనీర్లు 64 మంది అదే విభాగానికి చెందిన మెడికల్ సిబ్బంది ఏడుగురు, మిలటరీ సర్వీస్ ఇంజనీర్లు పది మంది, హైడ్రా సిబ్బంది 60 మంది, ర్యాట్ మైనర్స్ 14 మంది, సౌత్ సెంట్రల్ రైల్వేకు సంబంధించి 28 మంది సిబ్బంది ఉద్యోగులను కలుపుకుని మొత్తం 703 మంది సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు.



ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్ద ఆర్మీ

ఉన్నతాధికారులంతా ఇక్కడే..

సంఘటన జరిగిన మరుసటి రోజు నుంచి రాష్ట్ర ఉన్నతాధికారులందరూ వారం రోజులుగా ఇక్కడే ఉంటున్నారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ స్పెషల్ సెక్రటరీ ముషారఫ్‌ఆలీ, అరవింద్‌కుమార్, ఎక్సైజ్ కమిషనర్ శ్రీధర్, కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్‌లు వారం రోజులుగా ఇక్కడే ఉండి సహాయక చర్యలకు దిశా నిర్దేశం చేస్తున్నారు. వారం రోజుల్లో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావులు ఆరుసార్లు సంఘటన స్థలాన్ని సందర్శించి సహాయక చర్యలను ముమ్మరం చేసే విధంగా ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ సంఘటన స్థలం దగ్గరే ఉంటూ సహాయక చర్యల పురోగతిని ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులకు తెలియజేస్తున్నారు.



నారాయణపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల

ఇంటర్ పరీక్షలకు
ఏర్పాట్లు పూర్తి

- 5 నుంచి 22వ తేదీ వరకు
- నారాయణపేట జిల్లాలో 16, మహబూబ్‌నగర్ జిల్లాలో 36 కేంద్రాలు
- పేటలో 8,791 మంది
- పాలమూరులో 22,483 మంది పరీక్షలకు హాజరు
- కేంద్రాల వద్ద 144 సెక్షన్

నారాయణపేట, మార్చి1 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు నారాయణపేట, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అధికారులు ఏర్పాట్లు చేశారు. నారాయణపేట జిల్లాలో 8,791 మంది, మహబూబ్‌నగర్ జిల్లాలో 22,483 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ఈ నెల 5వ తేదీ నుంచి 22వ తేదీ వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. జిల్లా వ్యాప్తంగా 13 మండలాలకు గాను 16 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. 8,791 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. మొదటి సంవత్సరం 4,156 మంది, ద్వితీయ సంవత్సరం 4,635 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. మొదటి సంవత్సరం జనరల్ విద్యార్థులు 3635 మంది, వొకేషనల్ 521 మంది విద్యార్థులు ఉండగా, ద్వితీయ సంవత్సరం జనరల్ విద్యార్థులు 4049 మంది, వొకేషనల్ 586 మంది విద్యార్థులు ఉన్నారు. పరీక్షలు సజావుగా జరిగేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సిక్తాపట్నాయక్ అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించడంతో పాటు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నారు. విద్యార్థులు పరీక్షలకు సకాలంలో హాజరయ్యేలా గ్రామీణ ప్రాంతాల నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపనుంది. వైద్యశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేయనున్నారు. కేంద్రాల్లో మౌలిక వసతులను ఏర్పాటు చేయనున్నారు.

అరగంట ముందే చేరుకోవాలి

పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కొనసాగనున్నాయి. అరగంట ముందే విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతిస్తారు. 8:45 వరకు కేంద్రాల్లో కూర్చునేలా అధికారులు చర్యలు తీసుకోనున్నారు. 9 గంటలకు పరీక్షలు ప్రారంభమౌతాయి. 450 మంది ఇన్విజిలేటర్లను, ఒక ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం, ఒక సిట్టింగ్ స్క్వాడ్ బృందం, 16 మంది చీఫ్ సూపరింటెండెంట్స్, 16 మంది డిపార్ట్‌మెంట్ అధికారులు, నలుగురు అదనపు సూపర్‌వైజర్స్, ముగ్గురు కస్టోడియన్స్‌ను నియమించారు.

మహబూబ్‌నగర్ జిల్లాలో..

మహబూబ్‌నగర్ జిల్లాలో 36 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 22,483 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. కలెక్టర్ విజయేందిర బోయి సంబంధిత శాఖల అధికారులతో సమావేశమై ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని, ప్రశాంత వాతావరణంలో అన్ని ఏర్పాట్లు చేయాలని చెప్పారు.



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ముఖ్యమంత్రి హోదాలో..
తొలిసారి

- నేడు వనపర్తికి రానున్న సీఎం రేవంత్‌రెడ్డి
- రూ.721 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
- విద్యాభ్యాసం చేసిన మిత్రులతో అపూర్వ కలయిక
- పాలిటెక్నిక్ కళాశాల వద్ద బహిరంగ సభ

వనపర్తి అర్బన్, మార్చి1 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి హోదాలో రేవంత్ రెడ్డి తొలిసారిగా వనపర్తిలో పర్యటించనున్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా వనపర్తికి వచ్చిన ఆయన సీఎంగా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలి సారి వస్తున్నారు. వనపర్తి నియోజకవర్గంలో రూ.721 కోట్ల అభివృద్ధి పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపనలు చేయనున్నారు. 500 పడకల ప్రభుత్వ ఆస్పత్రి, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణం, రాజానగరం నుంచి పెద్దమందడికి బీటీ రోడ్డు, పెబ్బేరు 30 పడకల ఆసుపత్రితో పాటు తను విద్యా భ్యాసం చేసిన పాఠశాల, కళాశాల భవన నూతన నిర్మాణానికి, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అలాగే పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించనున్నారు. ఈ సభకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. ఈ సభలో వనపర్తి నియోజకవర్గ అభివృద్ధిపై సీఎం వరాల జల్లు కురిపిస్తారనే ఆశతో జిల్లా ప్రజలు ఉన్నారు.

సీఎం పర్యటన షెడ్యూల్

మొదటగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 11:30 నిమిషాలకు పాలిటెక్నిక్ కళాశాల మైదానం వెనకాల హెలిప్యాడ్ వద్ద ల్యాండ్ అవ్వనున్నారు. అక్కడి నుంచి ప్రత్యేక వాహనాల్లో 11:40 నుంచి 11:50 నిమిషాల వరకు వేంకటేశ్వరస్వామి దేవాలయం సందర్శన, దేవాలయ అభివృద్ధి పనులకు శిలాఫలకం ఆవిష్కరించనున్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి

(మిగతా 7లో..)




బహిరంగ సభ కోసం చేస్తున్న ఏర్పాట్లు

గుర్తుకొస్తున్నాయి..

- సీఎం రేవంత్‌రెడ్డి బాల్యమిత్రుల అనుభూతులు 7

రంజాన్ వేళలు

ఇఫ్తార్(ఆదివారం-6:30)
సహర్ (సోమవారం-5:13)



విద్యుత్ దీపాల వెలుతురులో మహబూబ్‌నగర్ మదీనా మస్జిద్

చాంద్ ముబారక్

- కనిపించిన నెలవంక 7
- రంజాన్ మాసం ప్రారంభం
- ఉపవాస దీక్షలు చేపట్టనున్న ముస్లింలు
- మసీదుల వద్ద ఏర్పాట్లు పూర్తి
- వెలసిన హలీం కేంద్రాలు

నిధులు వినియోగించుకోవాలి

కలెక్టర్ విజయేందిర బోయి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షా అభియాన్ ప్రాజెక్టు, పీఎంశ్రీ ద్వారా పాఠశాలలకు మంజూరైన నిధులను వినియోగించుకోవాలని కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలోని మినీ సమావేశ మందిరంలో సమగ్ర శిక్షా అభియాన్ ప్రాజెక్టు, పీఎంశ్రీ ద్వారా మంజూరైన నిధుల వినియోగం, పది పరీక్షలకు విద్యార్థుల సన్నద్ధంపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. మంజూరైన ఆయా నిధులను పాఠశాలల నిర్వహణ, భద్రత, ఆత్మరక్షణ, యువ, పర్యావరణ క్లబ్బులు, నిర్మాణ పనులకు ఖర్చు చే యాలన్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులు సన్నద్ధం అయ్యేలా అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండేలా చూడాలని, వంట గది, పరిసరాలు శుభ్రంగా ఉండాలని చెప్పారు. వేసవిలో తాగునీటి కొరత లేకుండా, టాయిలెట్స్ ఉపయోగంలో ఉండేలా చూడాలన్నారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, డీఈవో ప్రవీణ్ కుమార్, కేజీబీవీ ఏఎంవో దుంకుడు శ్రీనివాస్, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ కరుణాకర్ పాల్గొన్నారు.

పాలమూరులో 30 పోలీసు చట్టం: ఎస్పీ

మహబూబ్‌నగర్, మార్చి1 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లాలో ఈనెల 31 వరకు 30 పోలీసు చట్టం అమలులో ఉంటుందని ఎస్పీ జానకి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ చట్టం ప్రకారం సబ్ డివిజనల్ అధికారి లేదా ఉన్నతాధికారుల అనుమతి లేకుండా పబ్లిక్ మీటింగ్‌లు, ధర్నాలు నిర్వహించొద్దని తెలిపారు. నిషేధిత ఆయుధాలైన కత్తులు, చాకులు, కర్రలు, జెండా కర్రలు, దుడ్డుకర్రలు, తుపాకులు, పేలుడు పదార్థాలు, నేరానికి పురిగొలిపే ఎటువంటి ఆయుధాలు వినియోగించవద్దని కోరారు. జనాన్ని పోగు చేయొద్దని, లౌడ స్పీకర్లు, డీజేలు వినియోగించొద్దని చెప్పారు. ఉల్లంఘిస్తే శిక్షార్హులని పేర్కొన్నారు. జిల్లాలో 30 పోలీసు చట్టాన్ని ఏడాదిగా అమలు చేస్తున్నారు.

నష్టపరిహారం తేల్చిన తర్వాతే భూసర్వే చేయాలి



సీనియర్ అసిస్టెంట్ రాఘవేందర్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న రైతులు

● తహసీల్ ముందు రైతుల నిరసన

ఊట్కూర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ ఎత్తిపోతల పథకం కోసం మండల కేంద్రంలోని ఊట్కూర్, దంతన్‌పల్లి శివారులో చేస్తున్న భూసర్వేని నిలిపివేయాలని రైతులు డిమాండ్ చేశారు. తమతో మాట్లాడి నష్టపరిహారం తేల్చాలని డిమాండ్ చేస్తు శనివారం ఊట్కూర్ తహసీల్దార్ కార్యాలయం ముందు రైతులు బైఠాయించి, నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాకు తెలియకుండానే పోలీసుల సహకారంతో సర్వే చేస్తున్నారని మండిపడ్డారు. ముందుగా భూములు కోల్పోతున్న రైతులతో సమావేశం నిర్వహించి ఎవరి భూమి ఎంత పోతుంది, ఎంత నష్టపరిహారం చెల్లిస్తారో తేల్చకుండా సర్వే చేయడం మంచిది కాదన్నారు. తమతో మాట్లాడిన అనంతరం సర్వే చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ రాఘవేందర్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో రైతులు తరుణ్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డి, భరత్ తదితరులున్నారు.

నారాయణపేటను డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చాలి

● తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో ఇన్‌చార్జి డీఎస్పీ బుచ్చయ్య



సమావేశంలో మాట్లాడుతున్న బుచ్చయ్య

నారాయణపేట టౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లాలో మాదక ద్రవ్యాల నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేసి డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చాలని తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో ఇన్‌చార్జి డీఎస్పీ ఎన్.బుచ్చయ్య అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మాదక ద్రవ్యాల నిషేధంపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేయాలని ఆయా కమిటీల నేతృత్వంలో మాదక ద్రవ్యాల నిషేధంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలోని మాగనూరు ప్రాంతంలో గంజాయి సాగు జరుగుతుందనే సమాచారం ఉందని, దీనిపై వ్యవసాయ శాఖ అధికారులు, రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేవలం పోలీసు శాఖ అధికారులే కాకుండా సంబంధిత శాఖ అధికారులు తమతమ పరిధిలో డ్రగ్స్ నిషేధంపై ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ఆ యా కార్యక్రమాల వివరాలను తెలియపర్చాలన్నారు. అన్ని శాఖల అధికారులు మాదక ద్ర వ్యాల నిషేధంపై క్షేత్రస్థాయిలో నిఘా పెట్టాలని ఆదేశించారు. జిల్లాలో గంజాయి సాగును పూర్తిగా నిషేధించాలన్నారు. మాదక ద్రవ్యాల నిషేధిత జిల్లాగా నారాయణపేటను మార్చాలని అందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కోరారు. అనంతరం వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ లింగయ్య, ఆర్డీవో రాంచందర్, జిల్లా వ్యవసాయ అధికారి జాన్‌సుధాకర్, డీఈవో గోవింద రాజులు, ఆర్డీవో మేఘాగాంధీ ఉన్నారు.

'సదరం గుర్తింపునకు రిజిస్ట్రేషన్ చేసుకోండి'

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : సదరం గుర్తింపు కార్డు కొరకు యూడీఐడీ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని రాష్ట్ర పేదరిక నిర్మూళన సంస్థ (సెర్ప్) సీఈవో దివ్య దేవరాజన్ తెలిపారు. శనివారం సదరం క్యాంపులు, ప్రత్యేక వైకల్యం గుర్తింపు కార్డులు, సోలార్ ప్లాంట్ల ఏర్పాటుపై కలెక్టర్లు, డీఆర్డీవో, డీడబ్ల్యూవో, డీసీహెచ్ఎస్, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్‌లతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సదరం ధ్రువీకరణ పత్రాల కోసం యూడీఐడీ పోర్టల్ ద్వారా ఇజిస్ట్రేషన్ చేసుకునే విధంగా దివ్యాంగులకు అవగాహన కల్పించాలన్నారు. గతంలో మీసేవ కేంద్రాలను ఆశ్రయించేవారని, ఇప్పుడు వీటితో పాటు యూడీఐటీ పోర్టల్ లేదా మొబైల్ ద్వారా కూడా రిజిస్ట్రేషన్, స్లాట్‌లు బుక్ చేసుకోవచ్చని సూచించారు. ఈ ప్రక్రియను ఈ నెల నుంచే అమలులోకి తీసుకురావడం జరిగిందన్నారు. పీఎం కుసుం ప్రాజెక్ట్ కింద గ్రామీణ ప్రాంతాల్లో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకునేందుకు మహిళా సంఘాలను ప్రోత్సహించాలన్నారు.

భూదాన్ భూమిని స్వాధీనం చేసుకోండి

● అసైన్‌మెంట్ ఇచ్చిన వారికి హక్కులు రద్దు చేసి ప్రభుత్వ భూమిగా నమోదు చేయండి

● సీసీఎల్ఏ అధికారి నవీన్‌మిట్టల్

జడ్చర్ల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల పట్టణ శివారులోని భూదాన్ భూమిని స్వాధీనం చేసుకోవాలంటూ చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సీసీఎల్ఏ) అధికారి నవీన్ మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు. జనవరి 31న ఉత్తర్వులు జారీ అయ్యాయని, అందుకు సంబంధించిన వివరాలు అడ్వకేట్ శ్రీనివాస్‌గౌడ్, కక్షిదారులు ప్రణీల్‌చందర్ శనివారం మీడియాకు తెలిపారు. సర్వే నెంబరు 138లోని రెండెకరాల 10 గుంటల సొంత భూమిని అప్పటి ఎమ్మెల్యే కొత్త కేశవులు భూదాన్ యజ్ఞ బోర్డుకు అందచేశారన్నారు. వ్యవసాయం చేసుకుని జీవనం సాగించుకునేందుకు అట్టి భూమిని భూదాన్ యజ్ఞ బోర్డు నుంచి కావేరమ్మపేటకు చెందిన పోలిరెడ్డిపల్లి రాములు కుటుంబానికి అసైన్‌మెంట్ చేశారని తెలిపారు. కేవలం జీవనోపాధికి మాత్రమే భూమిని వినియోగించుకోవాల్సి ఉంటుందని, విక్రయించడానికి అవకాశం లేదని తెలిపారు. 2024 ఏప్రిల్‌లో నిబంధనలకు విరుద్ధంగా భూదాన్ భూమికి ఎన్‌వోసీ తెచ్చుకుని, సర్వే నెంబరు 138లో భూదాన్ భూమి లేదంటూ ఆ భూమిని కొందరు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్న వారంతా ఆ భూమికి నాలా తెచ్చుకున్నారని చెప్పారు. అయితే ఇదే సర్వే నెంబరులోని మిగతా 14 ఎకరాల 22 గుంటల భూమి ప్రోహిబిటెడ్‌గా రికార్డులలో నమోదైంది. దీంతో 14 ఎకరాల 22 గుంటల భూమికి సంబంధించిన పట్టాదారులంతా సీసీఎల్ఏ కోర్టుకు వెళ్లారు. నిబంధనలకు విరుద్ధంగా అసైన్‌మెంట్ భూమి సేల్ డీడ్‌తో రిజిస్ట్రేషన్ అయిన కారణంగా ప్రోహిబిటెడ్ జాబి తాలో చేరిందని సీసీఎల్ఏ అధికారులు వెల్లడించారన్నారు. దీంతో భూదాన్ భూమి అసైన్‌మెంట్ ఇచ్చిన వారికి హక్కులు రద్దు చేస్తూ, భూ దాన్ భూమిని వెంటనే స్వాధీనం చేసుకుని, రికార్డులలో ప్రభుత్వ భూమిగా నమోదు చేయాలంటూ కలెక్టర్, జడ్చర్ల తహసీల్దార్‌లకు సీసీఎల్ఏ అధికారి నవీన్‌మిట్టల్ ఉత్తర్వులను జారీ చేశారని పేర్కొన్నారు. ఈ భూమిని ప్రభుత్వ అవసరాలకు వినియోగించుకోవచ్చని ఉత్తర్వులలో పేర్కొ న్నారని తెలిపారు. జడ్చర్ల పట్టణ సమీపంలో ఉన్న ఈ భూమి విలువ ప్రస్తుత మార్కెట్‌లో దాదాపు రూ.7 కోట్ల విలువ ఉంటుందని తెలిపారు.

సెల్‌ఫోన్ ఆధారంగా వీడిన హత్య మిస్టరీ



వివరాలను వెల్లడిస్తున్న సీఐ రామకృష్ణ

● సెల్‌ఫోన్ ఇవ్వలేదని మహిళను రాళ్లతో కొట్టి చంపిన వ్యక్తి: సీఐ

భూత్పూర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలోని మునిరంగస్వామి జాతర ఉత్సవాల్లో భాగంగా ఫిబ్రవరి 26వ తేదీన కొత్త మొల్గర గ్రామానికి చెందిన ఆనెగాళ్ల రంగమ్మ (50) హత్యకు గురై చనిపోయింది. ఈ సంఘటనను పరిశీలించిన సీఐ రామకృష్ణ హత్యను ఛేదించేందుకు పరిశోధన మొదలు పెట్టారు. హంతకుడు వాడిన సెల్ ఫోన్ ఆధారంగా ఆనెగాళ్ల రంగమ్మను హత్య చేసింది భూత్పూర్ వాసిగా గుర్తించారు. ఈ సందర్భంగా శనివారం స్థానిక సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రంగమ్మ హత్య మిస్టరీని సీఐ రామకృష్ణ వివరించారు. ఆనెగాళ్ల రంగమ్మ ఫిబ్రవరి 19న మునిరంగస్వామి జాతర ఉత్సవాలకు వచ్చింది. అయితే, భూత్పూర్ పట్టణానికి చెందిన గడ్డం రాజు అనే వ్యక్తి ఆమెతో అదే రోజు రాత్రి జాతరలో పరిచయం చేసుకున్నాడు. తరువాత అదే రోజు రాత్రి జాతర పరిసర ప్రాంతంలో ఆమెతో శారీరకంగా కలిశాడు. అందుకు ఒప్పందం ప్రకారం మహిళకు రూ.300 డబ్బులు ఇవ్వాలి.. డబ్బులు లేకపోవడంతో ఆమెకు తన వద్ద ఉన్న ఫోన్ ఇచ్చాడు. అదే తరుణంలో మరోమారు కలిసేందుకు రంగమ్మను జాతర ప్రాంగణంలోకి రావాలని ఫోన్ చేశాడు. అనుకున్నట్లుగానే ఫిబ్రవరి 25వ తేది రాత్రి అదే ప్రదేశంలో ఇద్దరు శారీరకంగా మరోమారు కలిశారు. 26వ తేది తెల్లవారుజామున రంగమ్మ నిదుర లేచి వెళ్లిపోతుండగా నా ఫోన్ ఇవ్వమని హంతకుడు గడ్డం రాజు అడిగాడు. ఒప్పందం ప్రకారం నాకు డబ్బులు కావాలని రంగమ్మ చెప్పింది. నా దగ్గర డబ్బులు లేవని అతడు చెప్పాడు. అయితే నీకు ఫోన్ ఇవ్వనని సదరు మహిళ తెగేసి చెప్పింది. తాగిన మైకంలో కోపంతో ఊగిపోయిన హంతకుడు గడ్డం రాజు రంగమ్మ తలపై పొయ్యి రాళ్లతో దాడిచేశాడు. అంతటితో ఆగిపోకుండా ఆమె చనిపోయే వరకు రాళ్లతో కొట్టాడు. రక్తపు మడుగులో కొట్టుమిట్టాడుతున్న రంగమ్మను గుడి పూజారి చూసి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దీంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఆమెను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. కాగా, మృతురాలి భర్త సాయిలు ఫిర్యాదు మేరకు రంగంలో దిగిన సీఐ హత్య మిస్టరీని నాలుగు రోజుల్లోనే ఛేదించారు. హంతకుడు శనివారం భూత్పూర్ చౌరస్తాలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా అనుమానం వచ్చి అదుపులోకి తీసుకోవడంతో సంఘటన మొత్తం తెలిపినట్లుగా సీఐ వివరించారు. ఈ మేరకు హంతకుడిపై కేసు నమోదు చేసుకొని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సీఐ తెలిపారు. హత్య కేసులో పూర్తిస్థాయిలో శ్రమ పడ్డ ఎస్ఐ చంద్రశేఖర్‌ను, పోలీసు సిబ్బందిని సీఐ ప్రత్యేకంగా అభినందించారు.

వ్యక్తి అదృశ్యం

నవాబ్‌పేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : తన భార్యని ఇంటికి తీసుకొస్తానని వెళ్లిన కొడుకు తిరికి రాకపోవడంతో తల్లి యాదమ్మ శనివారం పోలీసులను ఆశ్రయించింది. మండలంలోని కారూర్ గ్రామానికి చెందిన శేఖర్‌కు జడ్చర్ల మండలం మక్తపల్లికి చెందిన చంద్రకళతో 13 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. గత ఏడాది 5-12-24 భార్యాభర్తలు గొడవపడి చంద్రకళ తన తల్లిగారింటికి వెళ్లింది. 24-2-2025 రోజు శేఖర్ భార్యను తీసుకొస్తానని తల్లికి చెప్పి వెళ్లి నేటికీ రాకపోవడంతో శనివారం ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ విక్రం తెలిపారు.

న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో సదస్సు

● మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఉచిత న్యాయ సలహాలు

నారాయణపేట రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో సీనియర్ సివిల్ న్యాయాధికారి ఆదేశాల మేరకు పేట మండలం సింగారం వద్దనున్న తెలంగాణ సాంఘీక సంక్షేమ రెసిడెన్సియల్ విద్యాలయంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పీపీ సురేష్, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ సభ్యులు లక్ష్మీపతిబొడ్, నాగేశ్వరిలు మాట్లాడారు. మహిళలు, ఎస్సీ ఎస్టీ, బీసీలకు న్యాయ సలహాల కోసం 15100 నెంబర్‌కు ఫోన్ చేసి సమస్యను పరిష్కరించేందుకు ఉచిత న్యాయ సలహాలు ఇస్తామన్నారు. వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం సర్వీస్‌డే సందర్భంగా న్యాయమూర్తి విద్యార్థులకు అల్పాహారం అందించారు. కార్యక్రమంలో పీపీ సురేష్, న్యాయవాది కాలప్ప ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

నవాబ్‌పేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విక్రం తెలిపారు. సిబ్బంది అశోక్‌గౌడ్ శనివారం తెల్లవారుజామున పక్కా సమాచారం మేరకు కారుకొండ - కూచూర్ గ్రామాల ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించి కారూర్‌కు చెందిన సంగెం నర్సింహరెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

వక్ఫ్ బిల్లు ఉపసంహరించే వరకు
పోరాడుతాం

▸▸ ఎండీ జబ్బార్



మాట్లాడుతున్న ఎండీ జబ్బార్

గద్వాల టౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : మైనార్టీల హక్కులను కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం కొత్తగా రూపొందించిన వక్ఫ్ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని ఎండీ జబ్బార్ డిమాండ్ చేశారు. బిల్లు ఉపసంహరణ జరిగే వరకు పోరాటం కొనసాగిస్తా మన్నారు. మైనార్టీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి అతిక్‌ఉర్ రెహమాన్ అధ్యక్షతన శనివారం పట్టణంలోని వాల్మీకి భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కొత్త బిల్లు పార్లమెంట్ ఆమోదం కోసం ఏర్పాటు చేసిన జేపీసీలో ప్రతిపక్ష పార్టీల సభ్యులు సూచించిన ఏ ఒక్క అభిప్రాయానికి, సవరణకు అవకాశం లేకుండా కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో తనకున్న మంద బలంతో బిల్లును ఆమోదింపచేసు కోవడం దుర్మార్గమన్నారు. సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు, ఆంజనేయులు, వెంకట స్వామి, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి నాగర్‌దొడ్డి వెంకట్రాములు, మధుసూదన్‌బాబు మాట్లాడుతూ.. కేంద్రం సాగిస్తున్న విద్వేష రాజకీయాలను ప్రజలు తిరస్కరించాలని కోరారు. ప్రజల మధ్య మతపరమైన విద్వేషాలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్రల్లో భాగమే కొత్త వక్ఫ్ చట్టమన్నారు. ఈ సందర్భంగా వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా సాగే పోరాటానికి అండగా ఉంటామని, అఖిలపక్షం, ప్రజా సంఘాల నాయకులు మద్దతు ప్రకటించారు. సమావేశంలో ప్రభాకర్, ఇన్సాఫ్, ఫయాజ్, రెహ మతుల్లా, పల్లయ్య, మహబూబ్ అలీ, గోపాల్‌రెడ్డి, నసరుల్లా, సాదతుల్లా, మగ్బూల్, తాహీర్, బాషా, జమాలుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రేపు వేరుశనగ
కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఉప్పునుంతల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ఉప్పునుంతలలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఆధ్వర్యంలో రేపు అచ్చంపేట -ఉప్పునుంతల రహదారి పక్కన ఉన్న నూతన గోదాం వద్ద వేరుశనగ కొనుగోలు కేంద్రాని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ప్రారంభిస్తారని సింగిల్‌విండో చైర్మన్ భూపాల్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని మండల రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఈ నెల 31లోగా ఎల్ఆర్ఎస్
దరఖాస్తులకు ఫీజు చెల్లించాలి

అచ్చంపేటటౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : అనుమతులు లేనిలే అవుట్లను క్రమబద్ధీకరించే ఉద్దేశంతో 2020లో స్వీకరించిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను ఈ నెల31లోగా క్రమ బద్దీకరించి ఫీజు చెల్లించిన వారికి 25శాతం రాయితీ లభిస్తుందని మునిసిపల్ కమిషనర్ యాదయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం జీవో నెం28 గతనెల 20న జారీ చేసిందన్నారు. సందేహాలు ఉంటే మునిసిపల్ కార్యాలయంలో ఎల్ఆర్ఎస్ హెల్ప్‌డెస్క్‌లో సంప్రదించాలన్నారు.

వైభవంగా చర్ల పరమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

- వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి స్వామి వారి పల్లకీసేవ



మైదానంలో తేరును లాగుతున్న భక్తులు

ఆత్మకూరు, మార్చి 1, ఆంధ్రజ్యోతి: ఆత్మకూరు పట్టణ కేంద్రంలో వెలిసిన చర్ల పరమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు శనివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి తేరు మైదానంలో బ్రహ్మోత్సవాలకు ఆయా గ్రామాల నుంచి భక్తులు నైవేద్యాలు అర్పించేందుకు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. వారికి ఎలాంటి ఆటంకాలు ఏర్పడకుండా షామియానాలు, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు నరసింహారావు, కోశాధికారి మనివర్ధన్ రెడ్డి, కార్యదర్శి సాయిరాఘవ, ఉపాధ్యక్షుడు యాదగిరి శెట్టి తెలిపారు. సాయంత్రం వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి స్వామి వారి పల్లకీ సేవతో ప్రారంభమై పుర వీధుల వెంట స్వామి వారి ఉత్సవ విగ్రహాలను జాతర మైదానం వరకు మంగళ వాయిద్యాలు, భజన కీర్తనలు, చిన్నారుల కోలాటాలు ప్రారంభమయ్యాయి. మండలంలోని ఆయా గ్రామాల భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని స్వామి వారికి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో పట్టణ వాసులు రహమతుల్లా, శ్రీనివాసులు, తులసిరాజ్, శ్రీను, దామోదర్, నగేష్, ప్రకాష్, నాయకులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుపై దృష్టి సారించాలి

- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చంద్రశేఖర్



ఇంద్రకల్ రైతు వేదికలో కేంద్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన వీసీలో అధికారులు

తాడూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని రైతులు ఇతర పంటలతో పాటు పప్పు దినుసులు, నూనె దినుసుల సాగుపై దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చంద్రశేఖర్ తెలిపారు. శనివారం మండలంలోని ఇంద్రకల్ గ్రామ రైతు వేదికలో కేంద్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రశేఖర్‌తో పాటు వ్యవసాయ శాఖ సిబ్బంది, వివిధ బ్యాంకులకు సంబంధించిన అధికారులు, రైతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్ అనంతరం డీఏవో మాట్లాడుతూ ఇటీవల కాలంలో భారతదేశ వ్యాప్తంగా పప్పుదినుసులు, నూనె దినుసుల సాగు విస్తీర్ణం దేశంలో తగ్గిందని తెలిపారు. ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోవడం వల్ల ప్రభుత్వానికి ఆర్థిక భారంగా మారిందని తెలిపారు. దిగుమతికి చేస్తున్న నిధుల ఖర్చును రైతులకు సబ్సిడీ రూపేనా చెల్లించి అత్యధిక విస్తీర్ణంలో పప్పుదినుసులు, నూనె దినుసులకు సంబంధించిన పంటల సాగుకు ప్రోత్సాహించాలని సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం శ్రీనివాస్‌రావు,ఏడీఏ వాసు, ఏవో సందీప్ కుమార్‌రెడ్డి, ఏఈవోలు, వివిధ బ్యాంకు అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఎస్ఎల్‌బీసీ ఘటనపై
విచారణ చేపట్టాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు

నాగర్‌కర్నూల్ టౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంపై జ్యుడీ షియల్ విచారణ చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యా లయంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఎల్‌బీసీ సొరంగం దగ్గర కనీస ప్రమా ణాలు పాటించకుండా పనులు ప్రారంభించడం వల్ల ఈ ప్రమాదం జరిగినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. ప్రమాదంపై కేంద్ర ప్రభుత్వం అవసరమైన సాంకేతిక సహాయం పూర్తి స్థాయిలో అందజేయడంలో విఫలమైందన్నారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం సమీక్షల పేరుతో కాలయాపన చేయకుం డా పనులను మరింత వేగవంతం చేసే విధం గా చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. గల్లంతైన ఎనిమిది మంది కార్మికుల కుటుంబాలకు నష్ట పరిహారంగా ఒక్కొక్కరికి రెండు కోట్ల రూపా యలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు పొది లరామయ్య, అశోక్, నాగపూర్ మదు, మల్లికా ర్జున్, కురుమయ్య పాల్గొన్నారు.

శనీశ్వర స్వామికి భక్తుల పూజలు



నందివడ్డెమాన్‌లోని శనీశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

బిజినేపల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : జేష్టాదేవి సమేత సార్ధసప్త శనీశ్వర స్వామికి భక్తులు తిల తైల అభిషేకాలు, భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మండల పరిధిలోని నందివడ్డెమాన్‌లోని నందీశ్వరాలయం ఆవరణలోని శనీశ్వర స్వామికి శనివారం భక్తులు నల్లని వస్త్రాలు ధరించి నువ్వుల నూనె, జిల్లేడు పూలు, నల్లని నువ్వులు, నల్లని వస్త్రంతో పూజలు చేశారు. అష్టమి, నవమి, త్రయోదశి, అమావాస్య తిథులు శనేశ్వర స్వామికి ప్రీతికరం. శనీశ్వర స్వామిని ఏడు వారాల పాటు పూజించిన అనంతరం ఆలయ ఆవరణలోని నందీశ్వర పరమశివునికి వివిధ రకాల పండ్ల రసాలు, బిల్వ పత్రాలతో అభిషేకాలు, రుద్రాభిషేకాలు నిర్వహిస్తే స్వామి వారి కృపకు నోచుకుంటారని భక్తుల విశ్వాసం. వివిధ జిల్లాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీటి వసతి, అల్పాహారం ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్‌రావు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన పూజారి డాక్టర్ గవ్వమఠం విశ్వనాథశాస్త్రి, పూజారులు ఉమామహేశ్వరం, శాంతికుమార్, ఆలయ కమిటీ సభ్యులు ప్రభాకరాచారి, వీరశేఖర్, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

రవాణా సౌకర్యం కల్పించాలి

- ఏపీ జలవనరుల శాఖ మంత్రిని కలిసిన పదర మండల వాసులు



ఏపీ జలవనరుల శాఖ మంత్రికి వినతి పత్రం ఇస్తున్న పదర నాయకులు

అచ్చంపేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : రవాణా సౌకర్యం కల్పనకు చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ జలవనరుల అభివృద్ధిశాఖ మంత్రి నిమ్మల రామానాయుడును పదర మండలంలోని నాయకులు కలిసి విజ్ఞప్తి చేశారు. పదర మండల పరిధిలోని కృష్ణానదిపై వంతెన నిర్మాణం చేపడితే ఇరురాష్ట్రాల ప్రజలకు రాకపోకలకు సులభతరం అవుతుందని వివరించారు. పదర మండల మాజీ జడ్పీటీసీ సభ్యుడు రాంబాబు, ప్రజలు బొమ్మ రమేష్ యాదవ్, రాజేష్ యాదవ్ శనివారం హైదరాబాద్‌లో ఆంధ్రామంత్రిని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ సభ్యుడు మాట్లాడుతూ పదర మండలంలోని ప్రజల ప్రధాన వృత్తి పశుపోషణ అని, వేసవి కాలంలో మేత కోసం ఆంధ్రకు వలస వెళ్తామన్నారు. తగు రవాణా సదుపాయం లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఇరురాష్ట్రాల సమన్వయంతో బ్రిడ్జి నిర్మాణం చేపడితే చాలా ఉపయోగకరంగా ఉంటుందని వారు ఆయనను కోరారు.



విద్యుద్దీపకాంతుల్లో మహబూబ్‌నగర్‌లోని మదీనా మసీదు

చాంద్ ముబారక్

- కనిపించిన నెలవంక
- రంజాన్ మాసం ప్రారంభం
- ఉపవాస దీక్షలు చేపట్టనున్న ముస్లింలు
- మసీదుల వద్ద ఏర్పాట్లు పూర్తి
- వెలసిన హలీం కేంద్రాలు

ముస్లింలు పరమ పవిత్రంగా భావించే రంజాన్ మాసం వచ్చేసింది. శనివారం సాయంత్రం నెలవంక దర్శనమివ్వడంతో ఆదివారం నుంచి ఉపవాస దీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇస్లాం మతంలో రంజాన్ నెలకు ఎంతో ప్రాధాన్యత ఉన్నది. దానధర్మాలకు ప్రతీకగా ఈ మాసం నిలువనున్నది. ఈ నెలలో ఇస్లాం మతసూత్రాలకు అధిక ప్రాధాన్యం ఇస్తారు. అరబ్బీలో 'రమ్జ్' అంటే కాల్చడమని అర్థం. నెలపాటు ఉపవాస దీక్షలతో శరీరం, ఆత్మలోని మలినాలు ప్రక్షాళన కావడంతో పాటు సర్వపాపాలు దహించుకుపోతాయని ముస్లిం మతపెద్దలు చెబుతారు.

మహబూబ్‌నగర్ అర్బన్/ఊట్కూర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): నెలవంక దర్శనమి వ్వడంతో మహబూబ్‌నగర్ నగరంలో రంజాన్ సైరన్ మోగింది. రంజాన్ మాసం వచ్చిందంటూ ముస్లింలు సంతోషంగా తమ బంధుమిత్రులకు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. అల్లా ఆరాధనలో గడిపే మాసం. ఖురాన్‌లో పేర్కొన్న ప్రకారం రంజాన్ నెలలో విధిగా ఆచరించాల్సిన నియమం ఉపవాస దీక్ష. దీనినే పార్శీ భాషలో రోజా, అరబ్బీలో సామ్ అంటారు. ఖురాన్ సంపూర్ణంగా ఆవతరించిన దినం కూడా రంజాన్ మాసంలోనే ఉండటం విశేషం. జిల్లా వ్యాప్తంగా మసీదులను సుందరంగా విద్యు ద్దీపాలతో అలంకరించారు. మహబూబ్‌నగర్‌లోని అన్ని మసీదుల్లో తరావీలో ఖురాన్ పఠనం చేస్తారు. కాగా, నగరంలోని క్లాక్‌టవర్, వన్ టౌన్, టీడీగుట్ట, న్యూటౌన్, మెట్టుగడ్డ, పద్మావతికాలనీ, శ్రీనివాస కాలనీ, హౌసింగ్ బోర్డులో హలీం సెంటర్లను ఏర్పాటు చేశారు.

సమయపాలన ముఖ్యం...

ధర్మ నిష్ఠతో ఉపవాసం ఉండాలి. నిర్ణీత సమయాల్లోనే సహెర్, ఇఫ్తార్ పాటించాలి. అందరు కచ్చితమైన సమయాన్ని పాటించేందుకు సైరన్ మోగిస్తారు. మంచినే పాటిస్తూ చెడుకు దూరంగా ఉండాలి. ఐదు పూటలు విధిగా నమాజ్ చేయాలి. ఖురాన్ పఠనం, సారాంశంపై అవగాహన. అల్లాహ్ నామస్మరణ, చింతన అలవర్చుకోవాలి. రంజాన్ చేసే ఏ పవిత్ర కార్యానికైనా 70 రెట్ల పుణ్యం అధికంగా లభిస్తుంది. అందువల్ల ఈ మాసంలో దానధర్మాలు విరివిగా చేస్తారు. మాసం చివరిలో ప్రతి ముస్లిం ఫిత్రా(దానం) చెల్లించుకోవాలి. ఆర్థిక స్థోమత ఉన్నవారు జకాత్ చేయాలి.

నియమాలు....

మత గ్రంథాల ప్రకారం వయోజనులైన స్త్రీ, పురుషులందరు విధిగా రోజా దీక్ష పాటించాలి. వృద్ధులు, పిల్లలు, వ్యాధిగ్రస్తులు, ప్రయాణంలో ఉన్న వారికి మినహాయింపు ఉంటుంది. రంజాన్ అంటే పాపాలను దహించి వేయుట అని అర్థం. ఉపవాస దీక్షలనేవి మనిషిలోని చెడు భావాలు. ఆదర్శం, ద్వేషాన్ని రూపుమాపేవిగా ఉండాలి. సాధ్యమైనంత వరకు పుణ్యకార్యాలు చేపడుతుండాలి.

- మహ్మద్ ప్రవక్త బోధించిన నియమాల ప్రకారం ఈ నెల రోజులు సూర్యోదయం(సహెర్) నుంచి సూర్యాస్తమయం(ఇఫ్తార్) వరకు నీటిని కూడా తాగకుండా ఉపవాసం ఉండాలి.
- రంజాన్ మాసంలోని 27వ రోజు రాత్రి షబే-ఏ-ఖదర్ జరుపుతారు. ఈ రాత్రుల్లో జాగరణ ఉండి, ప్రార్థన జరిపితే వెయ్యి నెలల పాటు నమాజ్ చేసినట్లు భావిస్తారు.

క్రైం కార్నర్

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

ఎర్రవల్లి/అలంపూరు/తాడూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. జోగుళాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండల పరిధిలోని జాతీయ రహదారిపై వేముల స్టేజి సమీపాన శనివారం ఉదయం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో తొమ్మిది మందికి గాయాలయ్యాయి. కోదండాపురం ఎస్‌ఐ మురళి కథనం ప్రకారం... ఏపీ రాష్ట్రం కర్నూలు జిల్లా క్రిష్ణగిరి మండలం తాళ్లగోకులపాడు గ్రామానికి చెందిన పదిమంది కలిసి తమ గ్రామంలో పెద్ద దేవర ఉండటంతో పొట్టేళ్లను కొనుగోలు చేసేందుకు పెబ్బేరుకు బయలుదేరారు. వారు ప్రయాణిస్తున్న ఆటోను తెల్లవారుజామున 5 గంటలకు వెనక నుంచి ట్యాంకర్ వాహనం అతివేగంగా ఢీకొట్టడంతో అందులో ప్రయాణిస్తున్న ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. దూదేకుల నబీసాబ్ (53) అనే వ్యక్తి మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ఆటో డ్రైవర్ పింజారి జుబేర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. ఢీకొన్న ట్యాంకర్ వాహనం ఆచూకీ లభ్యం కాలేదన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొని..



బి.సురేంద్ర (ఫైల్)

అలంపూరు మండలం కోనేరు గ్రామానికి చెందిన బి. సురేంద్ర శుక్రవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ద్విచక్ర వాహనంపై శుక్రవారం రాత్రి కర్నూలు నుంచి కోనేరు గ్రామానికి వెళ్తుండగా బూడిదపాడు, లింగనవాయి గ్రామాల దారిమధ్యలో వస్తుండగా ట్రాక్టర్‌కు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతుడ్ని పోస్టుమార్టం నిమిత్తం అలంపూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. శనివారం పోలీస్‌స్టేషన్‌లో మృతుడి తండ్రి లింగన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ వెంకటస్వామి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

బైకుపై వెళ్తూ ప్రమాదవశాత్తు కింద పడి..

తన మోటారు సైకిల్‌పై ఇంటికి వెళ్తూ ప్రమాదవశాత్తు రహదారి పక్కనే కింద పడి వ్యక్తి మృతి చెందిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం ఇంద్రకల్ సమీపంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మల్లేష్(38) నాగర్‌కర్నూల్ నుంచి సొంత ఊరైన ఇంద్రకల్‌కు మోటారు సైకిల్‌పై వస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు గ్రామానికి సమీపంలో బైకుపై నుంచి కింద పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో గమనించిన గ్రామస్థులు మల్లేష్‌ను గుర్తించి ఆసుపత్రికి తరలించే లోపే మృతి చెందినట్లు తెలిపారు. అనంతరం మృతదేహాన్ని నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

పాన్‌గల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదంగా వ్యక్తి మృతి చెందిన సంఘటన వనపర్తి జిల్లా పాన్‌గల్‌లో చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన ఎండీ రహమతుల్లా(44), పెయింటింగ్, మటన్ కటింగ్ చేస్తూ.. జీవనం కొనసాగిస్తుండే వాడు. మండల కేంద్రంలోని జూనియర్ కళాశాల సమీపంలో కేఎల్ఐ కాల్వ నీటిలో అతని మృతదేహం కనిపించింది. మృతుని బంధువు జాఫర్ ఖాన్ తెలిపిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో పొట్టేలు కోసేది ఉందని, ఎవరో గుర్తు తెలియని వ్యక్తి ఇంటికి వచ్చి అతడిని బయటకు తీసుకెళ్లాడు. కాసేపటికి జూనియర్ కాలేజీ వద్ద కేఎల్ఐ కాలువలో మృతదేహం కనిపిచ్చినట్లు చెప్పారు. ఉదయం 7:30 గంటల ప్రాంతంలో బహిర్భూమికి వెళ్లిన వారు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు చెప్పారు. మృతదేహాన్ని వనపర్తి ఆసుపత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ యాదవ్ తెలిపారు.


గుర్తుకొస్తున్నాయి..

● సీఎం రేవంత్‌రెడ్డి బాల్యమిత్రుల అనుభూతులు



కాలం అనేది ఎవరిని ఏ ఒడ్డుకు చేర్చుతుందో ఎవరికెరుక? ఆడి పాడే పసిప్రాయంలో జత కట్టిన ఆ చిన్నారులు కాలంతో పాటు ప్రయాణించి తలో దరికి చేరుకున్నారు. తమ అభిరుచిని, ఆసక్తిని, ఆర్థిక పరిస్థితి ఆధారం చేసుకుని వ్యాపారం వైపు కొందరు, ప్రభుత్వ సర్వీసులోకి కొందరు, రాజకీయాల వైపు మరికొందరు అడుగులు వేశారు. రాజకీయాల వైపు పడిన ఆ అడుగులు నేడు రాష్ట్రాన్నే పాలించే స్థాయికి ఎదిగాయి. ఆ అడుగుల స్థాయి ఎంత పెద్దదైనా చిన్ననాటి స్నేహితులను ఆనాటి జ్ఞాపకాలను మాత్రం మరువలేదు. ఈనెల 2వ తేదీన తామంతా చదువుతూ ఆడిపాడిన వనపర్తి వేదికగానే చిన్ననాటి మిత్రులను ఆయన కలుసుకుని మరెన్నో ఊసులు పంచుకోనున్నారు. ఈ పాటికే ఆయన ఎవరో మీకు తెలిసే ఉంటుంది. వనపర్తి బాలుర ఉన్నత పాఠశాలలో విద్యాభ్యాసం చేసి రాజకీయాల వైపు వెళ్లి అంచెలంచెలుగా ఎదిగిన మన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి. అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనల కోసం ఆయన ఆదివారం వనపర్తి జిల్లాకు రానున్నారు. ఈ సందర్భంగా ఆయన బాల్య మిత్రులతో కలిసి ముచ్చటించనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కలిసి చదువుకున్న ఆయన స్నేహితులతో అలనాటి అనుభూతులను తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.

- వనపర్తి రాజీవ్‌చౌరస్తా, (ఆంధ్రజ్యోతి)



ఉపాధ్యాయులు, స్నేహితులతో (వృత్తాకారంలో) రేవంత్‌రెడ్డి

● చెట్టుపై నుంచి రేగుపండ్లను రాల్చేవారు



వనపర్తి పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నేను రేవంత్‌రెడ్డి 8వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుకున్నాం. ఆ తరువాత ఇంటర్మీడియట్ కూడా ప్రభుత్వ జూనియర్ కాలేజీలో చదివాం. ఉదయం, సాయంత్రం ఫ్రెండ్స్ అంతా కలిసి సరదాగా గడిపే వాళ్లం. పట్టణంలోని ఓ ఇంటి సమీపంలో ఉన్న రేగు చెట్టును ఆయన ఊపి పండ్లను రాల్చేవాడు. మేమంతా రేగుపండ్లను ఏరుకునే వాళ్లం. రేవంత్‌రెడ్డి గోడల మీద వేసే చిత్రాలు, రాసే అక్షరాలు అద్భుతంగా ఉండేవి. అప్పట్లో ఆయన వాయిస్ కూడా చాలా బాగుండేది.

● సురేందర్ రెడ్డి, పీఈటీ

● ఇప్పటికీ ప్రచారానికి వెళ్తుంటాం



రేవంత్‌రెడ్డి, నేను ఎనిమిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఒకే పాఠశాల ఒకే కళాశాలలో చదువుకున్నాం. గోడలపై రేవంత్‌రెడ్డి వేసే ఆర్ట్స్ అందరినీ ఆకట్టుకునేవి. ఎన్నికల సమయంలో స్వచ్ఛందంగా చిన్ననాటి స్నేహితులమంతా రేవంత్‌రెడ్డి కోసం ఎన్నికల ప్రచారానికి వెళ్తుంటాం.

● జి.రాములు, డాక్యుమెంట్ రైటర్

● స్నేహితులను ఆటపట్టించేవాడు



రేవంత్‌రెడ్డి, నేను వనపర్తి పట్టణంలోని కేడీఆర్ నగర్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఏడవ తరగతి చదివాం. ఆ తరువాత బాలుర ఉన్నత పాఠశాలలో 8వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివాం. అనంతరం బాలుర జూనియర్ కళాశాలలో ఆయన బైపీసీ, నేను ఎంపీసీ కోరులో చదివాం. రేవంత్‌రెడ్డి స్నేహితుల జేబులో పెన్నులు దాచి సరదాగా ఆట పట్టించేవాడు. - కె. రఘువీర్ రెడ్డి

● అన్నా అని పిలిచేవాడిని..



వనపర్తి పట్టణంలోని కేడీఆర్ నగర్ ప్రాథమికోన్నత పాఠశాలలో నేను, రేవంత్‌రెడ్డి తమ్ముడు జగన్ రెడ్డి స్నేహితులం. మేము ఆరవ తరగతి చదువుతుండే వాళ్లం. అదే పాఠశాలలో రేవంత్‌రెడ్డి 7వ తరగతి చదువుతుండేవారు. అనంతరం అందరం బాలుర ఉన్నత పాఠశాలలో చదువుకున్నాం. ప్రతీ ఏడాది రేవంత్ మిత్రమండలి పేరిట ఆయన పేరున పట్టణంలోని వృద్ధాశ్రమంలో ప్రత్యేక కార్యక్రమాలు, అన్నదానం నిర్వహిస్తాం.

- శ్రీనివాస్ గౌడ్, వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్, వనపర్తి

విద్యాభ్యాసం ఇలా..

● రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 6వ తరగతి వరకు ప్రాథమిక విద్యాభ్యాసాన్ని తన సొంత గ్రామంలోనే పూర్తి చేశారు. 1980లో 7వ తరగతి చదవడానికి వనపర్తి వచ్చేశారు. పట్టణంలోని కేడీఆర్ నగర్ ప్రాథమికోన్నత పాఠశాలలో 7వ తరగతి చదివిన ఆయన అనంతరం బాలుర ఉన్నత పాఠశాలలో 8 నుంచి 10వ తరగతి వరకు (1980-1983) విద్యనభ్యసించారు. అనంతరం పట్టణంలోని బాలుర జూనియర్ కళాశాలలో బైపీసీ గ్రూపులో ఇంటర్మీడియట్ (1983-85) పూర్తి చేశారు.

● స్నేహితుడి రాక కోసం ఎదురు చూస్తున్నాం

తమతో కలిసి చదువుకున్న బాల్య మిత్రుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వనపర్తి వస్తున్నందుకు ఆనందంగా ఉందని ఆయనతో కలిసి వనపర్తిలో చదువుకున్న సురేందర్ రెడ్డి, గౌని వంశీధర్ రెడ్డి, కృష్ణయ్య, నారాయణ రెడ్డి, సహదేవ్, రఘువీర్ రెడ్డి, రుక్నందం, శ్రీనివాస్ గౌడ్, కిరణ్ కుమార్, బి.కృష్ణ తెలిపారు. శనివారం వారంతా పట్టణంలో కలిసి మాట్లాడుకున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి హోదాలో వనపర్తికి వస్తున్న స్నేహితుడి రాక కోసం ఎదురుచూస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

● రేవంత్‌రెడ్డి చిన్న నాటి మిత్రులు

రేవంత్‌రెడ్డి కుటుంబంతో ప్రత్యేక అనుబంధం



రేవంత్‌రెడ్డితో పార్వతమ్మ (ఫైల్)

- 12 సంవత్సరాలు మా ఇంట్లోనే ఉన్నారు
- ఇప్పటికీ సొంత అక్కలా ప్రేమ, ఆప్యాయతలతో ఉంటాడు
- వారి కుటుంబ సభ్యుల్లో ఏ కార్యం జరిగినా మాకు తప్పకుండా ఆహ్వానం అందుతుంది
- ముఖ్యమంత్రి అయ్యాక, ఆ తరువాత చాలాసార్లు కలిశాం



రేవంత్‌రెడ్డి గతంలో నివాసం ఉన్న ఇల్లు

వనపర్తి అర్బన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పాఠశాల, కళాశాలలో చదువుకునే రోజుల్లో 12 సంవత్సరాలు ఓ ఇంటిలో కిరాయికి ఉన్న వ్యక్తి ప్రస్తుతం రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఓ స్థాయికి ఎదిగినా ఆ ఇంటి కుటుంబ సభ్యులతో 40 సంవత్సరాల నుంచి ప్రేమ ఆప్యాయతలు కొనసాగుతూనే ఉన్నాయి. గత 40 సంవత్సరాల క్రితం వనపర్తి జిల్లా కేంద్రంలోని వల్లభ్‌నగర్ కాలనీలో ఓ ఇంట్లో తన కుటుంబ సభ్యులతో కలిసి రేవంత్ రెడ్డి నివాసం ఉన్నారు. దాదాపు 40 సంవత్సరాల తరువాత మళ్లీ ఆ తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకునేందుకు, ఆ ఇంటి కుటుంబ సభ్యులతో ఉన్న సన్నిహిత సంబంధాలతో ముఖ్యమంత్రి హోదాలో తొలిసారి వనపర్తికి నేడు వస్తున్నారు. ఆ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను కలవనున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఆ ఇంటికి వెళ్లిన 'ఆంధ్రజ్యోతి' సిబ్బందికి ఇంటి యజమాని అయిన పార్వతమ్మ పలు విషయాలను వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి : సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబంతో మీకున్న అనుబంధం?

పార్వతి: రేవంత్‌రెడ్డి కుటుంబంతో మాకు 40 ఏళ్ల అనుబంధం ఉంది. వాళ్ల సోదరుడు భూపతి రెడ్డి వనపర్తిలో పోలీస్ కానిస్టేబుల్‌గా పని చేస్తూ వారి కుటుంబ సభ్యులతో కలిసి మా ఇంట్లోనే 12 సంవత్సరాలు అద్దెకు నివాసం ఉన్నారు.

ఆంధ్రజ్యోతి : భూపతిరెడ్డితో పాటు వారి సోదరులు ఎవరెవరు ఉండేవారు?

పార్వతి: భూపతిరెడ్డి కానిస్టేబుల్‌గా పనిచేస్తూ.. తన సోదరులు తిరుపతిరెడ్డి, జగన్‌రెడ్డి, కొండల్ రెడ్డి, కృష్ణారెడ్డిలతో కలిసి నివాసం ఉండేవారు. రేవంత్‌రెడ్డి మా ఇంటి దగ్గర ఉండే ప్రభుత్వ పాఠశాల, కళాశాలలో ఇంటర్మీడియట్ దాకా ఇక్కడే ఉండి చదువుకున్నారు.

ఆంధ్రజ్యోతి : చదువుకునే రోజుల్లో రేవంత్‌రెడ్డి మీతో ఎలా ఉండేవారు?

పార్వతి : రేవంత్‌రెడ్డి కుటుంబ సభ్యులు మా ఇంట్లో నివాసం ఉన్న సమయంలో నాకు కొత్తగా వివాహమైంది. రేవంత్ రెడ్డి వాళ్లది పెద్ద కుటుంబం. వారితో పాటు మేమూ ఒకే కుటుంబం లాగా ఉండేవారం. అప్పటికీ ఇప్పటికీ నన్ను ప్రేమ ఆప్యాయతలతో అక్కా అని పిలుస్తుంటారు. వారి సొంత అక్కలాగా నన్ను చూసుకుంటారు. రేవంత్ రెడ్డిది అప్పటికే మొండి ధైర్యం. ఏమన్నా పని చెప్తే కాదనకుండా పట్టుబట్టి చేసేవాడు. నాకు ఇప్పటికీ గుర్తుంది. ఏ పని చెప్పినా పెండింగ్‌లో పెట్టేవాడు కాదు.

ఆంధ్రజ్యోతి : ముఖ్యమంత్రి హోదాలో వస్తున్నారు.. ఎలా ఫీలవుతున్నారు?

పార్వతి : మా ఇంటిలో నివాసమున్న వ్యక్తి అని నేనెప్పుడు అనుకోలేదు. ఒక కుటుంబ సభ్యుడిగా మాతో పాటు వారి కుటుంబ సభ్యులలో ఇప్పటికీ వారి ఇంట్లో ఏ కార్యాలు జరిగినా తప్పకుండా మాకు ఆహ్వానం అందిస్తారు.

సొంత అక్క ఇంటికి తమ్ముడు ముఖ్యమంత్రి హోదాలో వస్తే ఎలా ఉంటదో నాకు అలా చాలా గర్వంగా, సంతోషంగా ఉంది. మా ఆయన ఈశ్వర్ ఉంటే ఇంకా ఎంతో సంతోషపడేవారు.

ముఖ్యమంత్రి హోదాలో తొలిసారి..

● నేడు వనపర్తికి రేవంత్‌రెడ్డి రాక

(5వ పేజీ తరువాయి...)

12:25 నిమిషాల వరకు ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలుర మైదానంలో వివిధ అభివృద్ధి పనులకు శిలాఫలకాలను ఆవిష్కరించనున్నారు. 12:30 నుంచి 2:15 వరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విశ్రాంతి, 2:20 నుంచి 2:30 వరకు పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించి లబ్ధిదారులకు పథకాలను పంపిణీ చేయడంతో పాటు 'ఇందిరా మహిళా శక్తి- రేవంతన్న భరోసా' పథకం ప్రారంభోత్సవం, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా మైనార్టీ మహిళల లబ్ధిదారులకు కుట్టు మిషన్ల పంపిణీ, లోన్ మేళా ద్వారా లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ, జాబ్ మేళా ద్వారా నియామక పత్రాలు అందజేత, స్టాల్స్ సందర్శన చేయనున్నారు. 2:35 నుంచి 4:10 అనంతరం అక్కడే ప్రజా పాలన ప్రగతి బాట బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించనున్నారు. అనంతరం 4:15 తరువాత హెలిప్యాడ్ వద్దకు చేరుకుని హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం కానున్నారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనరసింహ, మంత్రులు సీతక్క, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎంపీ మల్లు రవితో పాటు ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర అధికారులు పాల్గొననున్నారు.

క్లాస్‌మేట్స్‌తో ఆత్మీయ సమ్మేళనం

రేవంత్‌రెడ్డి వనపర్తిలో చదువుకున్న రోజులలో తనతో పాటు ఉన్న మిత్రులను కలిసేందుకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. మొదట వెంకటేశ్వర స్వామి దేవాలయంలో పూజల అనంతరం, బాలుర కళాశాల మైదానంలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి, నేరుగా ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసుకు చేరుకుని బాల్య మిత్రులతో దాదాపు రెండు గంటలు వారితో సమావేశం కానున్నారు . అనంతరం అక్కడే వారితో కలిసి మధ్యాహ్నం భోజనం చేయనున్నారు. తనతో పాటు చదువుకున్న వ్యక్తి ముఖ్యమంత్రి స్థాయిలో మొదటిసారి స్నేహితులను కలవనుండడంతో సహచర మిత్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వెయ్యి మందితో పోలీసు బందోబస్తు


ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లా పర్యటన నేపథ్యంలో 1000 మంది పోలీస్ సిబ్బందితో భారీ బందోబస్తు నిర్వహిస్తున్నారు. భద్రత ఏర్పాట్లను శనివారం జోగులాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహన్, ఎస్పీ రావుల గిరిధర్ పరిశీలించారు. బహిరంగ సభతో పాటు హెలిప్యాడ్, వివిధ అభివృద్ధి పనుల శంకుస్థాపనలు ప్రారంభించే బాలుర జూనియర్ కళాశాల మైదానంతో పాటు ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో బాల్య మిత్రుల సమావేశం జరిగే ప్రాంతాలలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని డిఐజీ జిల్లా పోలీసు ఉన్నతాధికారులకు పలు సూచనలు చేశారు. ప్రధానంగా బహిరంగ సభకు వచ్చే కార్యకర్తల వాహనాలతో పాటు ఉన్నతాధికారుల వాహనాలను ఎక్కడికి అక్కడ పార్కింగ్ స్థలాల్లో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉదయం 8 గంటల కల్లా పోలీస్ సిబ్బంది తమకు కేటాయించిన ప్రాంతాలలో విధులకు హాజరు కావాలని , విధుల పట్ల ఎవరు నిర్లక్ష్యం వహించిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బహిరంగ సభకు వచ్చే విఐపిల వాహనాలకు ఆర్టీసీ బస్సు డిపో ఖాళీ స్థలంతో పాటు మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



బహిరంగ సభకు జరుగుతున్న ఏర్పాట్లు

బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించిన ఎంపీ, ఎమ్మెల్యే

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సభకు పార్టీలకు అతీతంగా తరలి రావాలని ఎమ్మెల్యే మేఘారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో జరుగుతున్న బహిరంగ సభ ఏర్పాట్లతో పాటు వివిధ అభివృద్ధి పనుల శంకుస్థాపనలు చేసే ప్రాంగణాలను పరిశీలించారు. ముఖ్యమంత్రి హోదాలో రేవంత్‌రెడ్డి తొలిసారి వనపర్తికి వస్తున్న నేపథ్యంలో జిల్లాలోని నలుమూలల నుంచి పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గతంలో మునుపెన్నడు లేని విధంగా అభివృద్ధి పనులు నియోజకవర్గంలో జరుగుతున్నాయని అన్నారు. ప్రధానంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనను తన భుజాలపై వేసుకుని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అంతకుముందు ఎంపీ మల్లు రవి పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. వీరితో పాటు విద్యాశాఖ కమిషనర్, కలెక్టర్ ఆదర్శ్ సురభి పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పూజ చేయనున్న వేంకటేశ్వర స్వామి దేవాలయం

కాశీంనగర్ ఎత్తిపోతల పథకం మంజూరు

● ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, (ఆంధ్రజ్యోతి): వనపర్తి అసెంబ్లీ నియోజ కవర్గంలోని ఆరు గ్రామాలు, 13 గిరిజన తండాల్లోని దాదాపు నాలుగు వేల ఎకరాలకు సాగునీరు అందించే కాశీంనగర్ లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ మేరకు శనివారం ప్రభుత్వం మెమో నెంబరు జారీ చేసిందన్నారు. ఆదివారం సర్వే పనులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయను న్నారని ఆయన పేర్కొన్నారు. కాశీంనగర్ లిఫ్టు ఇరిగేషన్ పథకాన్ని మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం వనపర్తిలో జరగనున్న ముఖ్యమంత్రి బహిరంగ సభకు రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని చిన్నారెడ్డి కోరారు.

వనపర్తికి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్

● నేడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన



ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నమూనా

వనపర్తి అర్బన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేద, మధ్య తరగతి విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్యను అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేస్తున్న ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాట్లలో భాగంగా వనపర్తి జిల్లాలో ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేయనున్నారు. ఇప్పటికే వనపర్తి జిల్లాలో ఇంజనీరింగ్, ఫిషరీస్, వ్యవసాయ, ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ఉన్నాయి. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను మంజూరు చేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

● అంతర్జాతీయ స్థాయిలో..

సుమారు 20 నుంచి 25 ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో భవనం నిర్మించనున్నారు. స్థానిక వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా స్కూల్ భవన నిర్మాణం జరపనున్నారు. విద్యార్థులకే కాకుండా బోధన బోధనేతర సిబ్బందికి కూడా క్వార్టర్స్ నిర్మించనున్నట్లు సమాచారం. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ గురుకుల పాఠశాలలన్నీ ఒకే ప్రాంగణంలోకి వస్తాయి. 5 వ తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులు ఉంటారు. ఈ స్కూల్‌లో ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్‌తో ఇంగ్లీష్ మీడియం 12వ తరగతి వరకు బోధన అందించనున్నారు. విద్యార్థులకు లైబ్రరీలతో పాటు కంప్యూటర్లు కూడా ఉండనున్నాయి. అన్ని తరగతులు డిజిటల్ బోర్డుల ద్వారా విద్యాబోధనలు చేయనున్నారు.

● నేడు రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లా పర్యటన నేపథ్యంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. ఈ భవన నిర్మాణానికి ఇప్పటికే ఎమ్మెల్యే మేఘారెడ్డితో పాటు కలెక్టర్ ఆదర్శ్ సురభి వనపర్తి జిల్లా కేంద్రం సమీపంలోని చందాపూర్ రోడ్డులో స్థల సేకరణ కూడా పూర్తి చేసినట్లు సమాచారం.

ఇంటర్వ్యూ..

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

» ఎంఈవో నాగ్యనాయక్



నవాబ్‌పేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి వార్షిక పరీక్ష లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంఈవో నాగ్యనాయక్ కోరారు. శనివారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు వివరించారు.

ఎక్కువ మంది విద్యార్థులు ఫెయిల్ అవడానికి కారణం?

విద్యార్థులు ఒత్తిడికి లోనై పరీక్షలు సరిగ్గా రాయలేకపోతున్నారు. ఒత్తిడికి లోను కాకుండా చదువుకున్నది గుర్తుకు తెచ్చుకొని పరీక్షలు రాయాలి.

విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పిస్తున్నారా?

మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కౌన్సిలింగ్ ఇప్పించాం. జీహెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు వారిని పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తున్నారా?

అందరూ సమయపాలన పాటిస్తున్నారు. ఎక్కడా సమయపాలన పాటించడం లేదని నా దృష్టికి రాలేదు.

పాఠశాలల్లో మరుగుదొడ్ల సమస్య ఉందా?

ప్రభుత్వం మంజూరు చేసిన మరుగుదొడ్లను కొన్ని చోట్ల వాడటం లేదు. అలాగే మరికొన్ని చోట్ల మరుగుదొడ్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు నా దృష్టికి వచ్చింది. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేశాం.

న్యూస్ బాక్స్

అక్రమాలపై విచారణ

మహమ్మదాబాద్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కంచిపల్లి గ్రామంలో డ్వాక్రా సంఘాల్లో జరిగిన అవినీతిపై డీఆర్‌డీఏ డైరెక్టర్ నరసింహారెడ్డి విచారణ చేపట్టి, అవినీతికి పాల్పడిన వారి నుంచి డబ్బులు రికవరీ చేయాలని ఆదేశించారు. ప్రాజెక్టు మేనేజర్ నరసింహస్వామి, అధికారులు జోజప్ప, సలోమి, రాముసాయక్, ఏపీఎంలు సునీత, బాలకృష్ణ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

మిడ్జిల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మసిగుండ్లపల్లి గ్రామానికి చెందిన బోరుమోటార్ల మెకానిక్ వెంకటయ్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మండల వ్యాపార సంఘం నాయకులు శనివారం పరామర్శించి, రూ.5 వేలు అందజేశారు. అదే విధంగా వాడియాల గ్రామానికి చెందిన తిరుమనిదాస్ సత్యమ్మ, అదే గ్రామానికి హుస్సేన్ భార్య మృతి చెందగా, గ్రామానికి చెందిన గడ్డల విజయ్‌కుమార్ మృతుల కుటుంబాలను పరామర్శించి వేర్వేరుగా రూ.5 వేలు అందజేశారు.

గృహ నిర్మాణంలో సూచనలు పాటించాలి

కోయిలకొండ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు గృహ నిర్మాణంలో అధికారుల సూచనలు పాటించాలని హౌసింగ్ పీడీ భాస్కర్ సూచించారు. శనివారం మండలంలోని అయ్యవారిపల్లిలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో పాల్గొని, మాటాడారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ఎలా ఉండాలి, బేస్‌మెంట్, చెత్తు ఇతర అంశాలపై అవగాహన కల్పించారు. పైలెట్ ప్రాజెక్టుగా అయ్యవారిపల్లెలో 60 ఇళ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. డిప్యూటీ ఈఈ పుష్పలత, ఎంపీడీవో హరీష్‌రెడ్డి, నాయకుడు మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల్లో వసతుల పరిశీలన

నవాబ్‌పేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 5 నుంచి ఇంటర్ పరీక్షలు ప్రాంభం కానున్న నేపథ్యంలో శనివారం మండలంలోని యన్మనగండ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన వసతులు, సమసప్యలపై నవాబ్‌పేట ఎంపీడీవో జయరాములు ప్రిన్సిపాల్ మద్దిలేటితో కలిసి పరిశీలించారు.

ఆకట్టుకున్న సైన్స్ ఫెయిర్

మూసాపేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : అడ్డాకుల మండల కేంద్రంలోని గ్రామర్ స్కూల్‌లో శనివారం ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా విద్యార్థులు సైన్స్ ప్రయోగాలు స్వయంగా తయారు చేసి, వాటిని ప్రదర్శించి పనితీరు వివరించారు. సోలార్, వాటర్ సైక్లింగ్, సేవ్ ఎర్త్, న్యూక్లియర్ రియాక్టర్, ఆక్సిజన్, హైడ్రోజన్, ఓజోన్, మిథేన్ వాయువులకు తయారీ వాటి వినియోగం, కిరణజన్య సంయోగ ప్రక్రియ, జీవ రసాయనిక, సేంద్రియ ఎరువులు, కంపోస్టు ఎరువుల తయారీ వాడకం, నత్రజని ఫాసరస్ ప్రయోగాలు ఆకర్షణీయంగా ఉన్నాయి. ఈ సందర్భంగా ఎంఈవో కురుమూర్తి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గోవర్ధన్‌చారి, పిన్సిపాల్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

తీరనున్న సమస్య

» దివిటిపల్లి రైల్వే బ్రిడ్జి పనులు ప్రారంభం » రెండు నెలల్లో పూర్తి అయ్యే అవకాశం



రైల్వే పై ఓవర్‌పై అమర్చిన ఐరన్ బీమ్స్

మహబూబ్‌నగర్ అర్బన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని దివిటిపల్లిలోని 44వ జాతీయ రహదారిపై రైల్వే పై ఓవర్ బ్రిడ్జి పనులు ప్రారంభమయ్యాయి. గత 15 రోజులు నుంచి భారీ క్రేన్‌ల సహాయంలో రైల్వే అధికారుల పర్యవేక్షణలో పనులు చేపట్టారు. నాలుగేళ్లుగా రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడంతో ఒకే దారిలో వాహనాల రాకపోకలు సాగిస్తుండడంతో అత్యవసర సమయాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కిలో మీటర్ల మేర ట్రాఫిక్ నిలిచి పోవడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడేవారు. అయితే మరో రెండు అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉండగా, ఒక బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఒక బ్రిడ్జి పనులు పూర్తైన తరువాత మరో బ్రిడ్జి నిర్మాణ పనులు చేపడుతారు. ఎట్టకేలకు పనులు ప్రారంభించడంతో వాహనదారులు, ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మరో రెండు నెలలు సమయం పట్టనుండగా, పనులు పూర్తైతే ట్రాఫిక్ సమస్య తీరనుంది.



చేపట్టిన అండర్ బ్రిడ్జి పనులు

పనులు త్వరగా పూర్తి చేయాలి



రైల్వే బ్రిడ్జి, అండర్ బ్రిడ్జి పనులు వేగంగా పూర్తి చేసి వన్ వే సమస్యను పరిష్కరించాలి. ప్రమాదాలు జరిగితే గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. అధికారులు దృష్టి సారించి పనులు పూర్తి చేయాలి.

- ఆనంద్, నగరవాసి

పనుల్లో వేగం పెంచాలి..



మూడేళ్లుగా వన్‌వేతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజు వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. వన్ వే వల్ల ప్రమాదాలు జరిగి చాలా మంది ప్రాణాలు కోల్పోయారు.

- కుమార్‌గౌడ్, వాహనదారుడు

ట్రాఫిక్ సమస్య ఉంది..



జాతీయ రహదారి కావటంతో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. వన్‌తో ట్రాఫిక్ జాం కావడంతో గంటల తరబడి వేచి ఉంచాలి. కొరియర్‌లో పని చేస్తాను. సకాలంలో ఆర్డర్ చేసిన వస్తువులు ఇవ్వలేక ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

- జహీర్, కొరియర్ బాయ్

మైనార్టీల సంక్షేమానికి కృషి



సర్టిఫికెట్లు అందుకున్న మహిళలతో టీజీఎంఎఫ్‌సీ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్

మహబూబ్‌నగర్ అర్బన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. ఇండియన్ ఓవర్సీస్ కన్వీనర్ అక్బర్, హెల్పింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో టైలరింగ్‌లో శిక్షణ పొందిన మహిళలకు శనివారం అల్మాస్ ఫంక్షన్ హాల్‌లో సర్టిఫికెట్ల ప్రధానోత్సవం కార్యక్రమానికి ఆయన పాల్గొని, మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, మైనార్టీల కోసం నైపుణ్యాభివృద్ధికి శిక్షణను అమలు చేస్తోందని, మైనార్టీల అభ్యున్నతికి, సంక్షేమాని ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఆదివారం వనపర్తిలో సీఎం రేవంత్‌రెడ్డి కుట్టు మిషన్‌ల పంపిణీ కార్యక్రమాన్ని మొదటి విడతలో భాగంగా 10,940 పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. రెండో విడతలో రాష్ట్ర వ్యాప్తంగా 31,740 కుట్టు మిషన్లు పంపిణీ చేస్తామని వెల్లడించారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అనిత, నాయకులు చంద్రకుమార్ గౌడ్, అబ్దుల్‌హదీ, ఫయాజ్, అవేజ్, అజ్మత్‌అలీ, జహీర్, షా ఫైసల్, తఖీ, సాదతుల్లా, తాహెర్, పీర పాల్గొన్నారు.

కవితకు బీసీల గురించి మాట్లాడే హక్కులేదు

పాలమూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు 46శాతం రిజర్వేషన్లు కల్పించాలని మాట్లాడే నైతిక హక్కు బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవితకు లేదని బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లు పాలించి అధికారంలో ఉన్నప్పుడు గుర్తుకు రాని బీసీలు నేడు ఎలా గుర్తుకొచ్చారని ప్రశ్నించారు. నిజంగా బీసీలపై ప్రేమ ఉంటే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎంబీసీకి సీటు కేటాయించి చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు. లక్ష్మీకాంత్, అశ్విని సత్యం, సత్యనారాయణ, విశ్వనాథం పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలన

జడ్చర్ల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మండలం ఉదండాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థుల గణిత సామర్థ్యాన్ని శనివారం జడ్చర్ల ఎంఈవో మంజులాదేవి పరిశీలించారు. విద్యార్థుల అపార్ ఐడీ వందశాతం జనరేట్ చేయించడం, ఎఫ్‌ఎల్‌ఎన్ నిర్వహణతో పాటు సీసీఈ, మధ్యాహ్న భోజనం తదితర అంశాలపై హెచ్‌ఎం సుధాకర్‌రెడ్డి వివరాలు తెలుసుకున్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

మహబూబ్‌నగర్ అర్బన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎంఐఎం బలోపేతానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలని జిల్లా అధ్యక్షుడు అబ్దుల్‌హదీ పిలుపునిచ్చారు. ఎంఐఎం ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ఆ పార్టీ కార్యాలయంలో జెండాను ఆవిష్కరించి, మాట్లాడారు. బాబా సాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగ పరిరక్షణ కోసం పార్టీ నిరంతరం పని చేస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జాకీర్, పట్టణ అధ్యక్షుడు సాదుతుల్లా హుస్సేనీ, నాయకులు మునజమిల్, ముస్తాక్‌రషీద్, సజ్జు, ఇలియాజ్, జమీర్ పాల్గొన్నారు.

● జడ్చర్ల : ఎంఐఎం ఆవిర్భావ దినోత్సవం కార్యక్రమాన్ని శనివారం జడ్చర్ల పట్టణంలో నాయకులు ఘనంగా నిర్వహించారు. కావేరమ్మపేట చౌరస్తా వద్ద ఎంఐఎం జెండాను ఆ పార్టీ నియోజకవర్గ అధ్యక్షులు జాకీర్‌అలీ ఆవిష్కరించారు. ఎంఐఎం నాయకులు యాసర్, జాహిద్, ముబీన్, షకీల్, సాబెర్ పాల్గొన్నారు.



ఎంఐఎం జెండా ఎగురవేసిన నాయకులు

అప్రమత్తతతోనే సైబర్ నేరాలకు అడ్డుకట్ట

మహబూబ్‌నగర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : అప్రమత్తతతోనే నేరాలకు అడ్డుకట్ట వేయవచ్చని ఎస్పీ జానకి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నేరం జరిగిన మొదటి గంట (గోల్డెన్‌అవర్)లో ఫిర్యాదు చేయడం వల్ల స్కామర్ అకౌంట్‌ను ఫ్రీజ్ చేసి పోయిన డబ్బు సులభంగా రికవరీ చేయవచ్చని తెలిపారు. సైబర్ నేరగాళ్ల బారిన పడి మోసపోతే 1930కి కాల్ చేయాలన్నారు. మహబూబ్‌నగర్ పరిధిలో వారం రోజుల్లోనే పలు సైబర్ నేరాలు జరిగాయని వాటిని ఎస్పీ వివరించారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ ఉపాధ్యాయుడి నుంచి విడతల వారిగా రూ.84 లక్షలు కాజేశారన్నారు. నగరంలో ఆయనకు ఉన్న ఖాళీ స్థలంలో సెల్‌టవర్ నిర్మించి ప్రతీనెల రూ.50 వేలు అద్దె ఇస్తామని నమ్మించారని వివరించారు. ఆ తరువాత మొదట కొంత డబ్బు చెల్లించాలని చెప్పడంతో లక్ష రూపాయలు వేశారని, ఆ తరువాత విడతల వారిగా రూ.84 లక్షలు ఆన్‌లైన్‌లో వసూలు చేశారని చెప్పారు. అలాగే రూరల్ పరిధిలో ఓ వ్యక్తికి ధని యాప్ ద్వారా రూ.20 లక్షలు లోన్ మంజూరైందని వాట్సప్‌కు మెసేజ్ వచ్చిందని, లోన్ మంజూరు చేయడానికి ప్రాసెసింగ్ ఫీజు, జీఎస్టీ, టాక్స్ కట్టాలని చెప్పగా బాధితుడు రూ.80,784 చెల్లించి మోసపోయాడని గుర్తు చేశారు. జడ్చర్లలో ఓ వ్యక్తి వాట్సప్ ద్వారా హోటల్స్‌కు రేటింగ్ ఇస్తే అమౌంట్ వస్తాయని చెప్పాడు. నమ్మిన అతను రేటింగ్ ఇవ్వగా ప్రతీ రేటింగ్‌కు రూ.100 సైబర్ నేరగాళ్లు చెల్లించారన్నారు. తరువాత పెట్టుబడులు పెడితే ఎక్కువగా లాభాలు వస్తాయని చెప్పగా నమ్మి రూ.4,29,100 పెట్టుబడి పెట్టగా ఆ తరువాత ఫోన్ స్విచాఫ్ చేశారు.

మాదిగ అమరవీరులకు ఘన నివాళి





జడ్చర్ల, దేవరకద్రలో మాదిగ అమరవీరులకు నివాళి అర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

జడ్చర్ల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ పోరాటంలో ప్రాణాలు పోగొట్టుకున్న మాదిగ అమరవీరులకు ఎమ్మార్పీఎస్ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. జడ్చర్ల పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మాదిగ అమరవీరుల చిత్రపటానికి నివాళి అర్పించారు. ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి జంగయ్యమాదిగ, నాయకులు కృష్ణయ్య, కొంగళి నాగరాజు, కరాటే శ్రీను, వినోద్, శివ, యాదయ్య, రాజేష్, చెన్నకేశవులు, బ్యందం గోపాల్, భీంరాజ్, సత్యం పాల్గొన్నారు. అంతముందు టీఎమ్మార్పీఎస్ నాయకులు శ్యాంసుందర్, భీంరాజ్, లక్ష్మణ్, మాసన్న, మాచారం కృష్ణయ్య, ఖాసీం, రాజు నివాళి అర్పించారు.

● పాలమూరు : వర్గీకరణ కోసం ప్రాణాలు అర్పించిన మాదిగ అమరవీరులను స్మరించుకుందామని ఎమ్మార్పీఎస్, టీఎమ్మార్పీఎస్ నాయకులు పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో బాబు జగ్జీవన్ రాం విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కృష్ణయ్య, వెంకటస్వామి, బాలయ్య, రాములు, ఖాదరయ్య, రాంచందర్, కొండయ్య, నాగయ్య, ఉదయకిరణ్, వెంకటేష్ పాల్గొన్నారు.

● మిడ్జిల్ : మండల కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో అమరులైన మాదిగ అమరవీరుల చిత్రపటాలకు ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌ఎఫ్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి టైగర్ జంగయ్య మాదిగ ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు పడిగాళ్ల సురేష్‌మాదిగ నివాళి అర్పించారు.

భూత్పూర్ : భూత్పూర్ చౌరస్తాలో ఎస్సీ వర్గీకరణలో అమరులైన దళిత సోదరులకు నివాళి అర్పించారు. దళిత సంఘం నాయకుడు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ గడ్డం యాదయ్య, దళిత సంఘం నాయకులు జగన్, యాదయ్య, రాములు, మండి వెంకటయ్య, వీరస్వామి, పవన్ కల్యాణ్, కురుమూర్తి, కాశప్ప పాల్గొన్నారు.

● హన్వాడ : అమరుల ఉద్యమ త్యాగ ఫలితమే వర్గీకరణ అని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జంబులయ్య అన్నారు. మండలంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద అమరులకు నివాళి అర్పించారు. భారతమ్మ, సురేందర్, మహేష్, నాగేశ్వర్‌రావు, దామోదర్, ప్రభాకర్ ఉన్నారు.

● దేవరకద్ర : దేవరకద్ర అంబేడ్కర్ కాలనీలో మాదిగ అమరువీరుల చిత్ర పటానికి ఎమార్పీఎస్ రాష్ట్ర నాయకులు దొబ్బలి అంజనేయులు నివాళి అర్పించారు. ఎమార్పీఎస్ మండల నాయకులు రాజు, చెన్నప్ప, రామస్వామి, రామాంజనేయులు, గోపి, బాల్‌రాజు పాల్గొన్నారు.

మునిసిపాలిటీ అభివృద్ధికి సహకరించాలి



కందూరు బ్రహ్మోత్సవాల పోస్టర్లు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్

దేవరకద్ర, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : కొత్తగా ఏర్పడిన మునిసిపాలిటీ అభివృద్ధికి అధికారులు సహకరించాలని ఎమ్మెల్యే జీ.మధుసూదన్‌రెడ్డి సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అధికారులు, ఆయా గ్రామాల నాయకులతో ఏర్పాటు చేసిన రివ్యూ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. దేవరకద్రతో పాటు బల్సుపల్లి, మినిగోనిపల్లి, చౌదర్‌పల్లి, గోప్లాపూర్ గ్రామాలకు చెందిన ఉపాధి కూలీలకు పెండింగ్‌లో ఉన్న కూలి డబ్బులు వెంటనే పడే విధంగా చూడాలని ఆ శాఖ అధికారులకు తెలిపారు. ఆ గ్రామాల్లో పెండిగ్ పనులు, అభివృద్ధి జరగాల్సిన పనుల వివరాలు తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. వేసవిలో నీటి ఎద్దడి, విద్యుత్ సమస్య లేకుండా ఆశాఖ అధికారులు చూడాలన్నారు. టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్‌కుమార్ రెడ్డి, మండల అధ్యక్షుడు అంజిల్‌రెడ్డి, ఫారుక్‌అలీ ఎంపీడీవో శ్రీనివాస్ రావు, తహసీల్దార్ కృష్ణయ్య పాల్గొన్నారు.

రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్ విడుదల

మూసాపేట : కందూరు రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్లను శనివారం మన్నెంకొండ దేవస్థానంలో ఎమ్మెల్యే జీఎంఆర్ విడుదల చేశారు. ఈనెల 11 నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఆలయ ఈవో రాజేశ్వర్‌శర్మ, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు కొరెడ్డి నాగిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తోట శ్రీహరి, ఆలయ కమిటీ అధ్యక్షులు రవీందర్ శర్మ, నాయకులు అరవింద్‌కుమార్‌రెడ్డి, కొండా జగదీశ్వర్, బాలనర్సింహులు, దామోదర్‌రెడ్డి, అంజిల్‌రెడ్డి, రంజిత్, నరేందర్ పాల్గొన్నారు.

యుద్ధభేరి సభను విజయవంతం చేయాలి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : సీపీఎస్ రద్దు చేసి పాతపెన్షన్ విధానం అమలు చేయాలని కోరుతూ ఆదివారం చేపట్టే యుద్ధభేరి సభను విజయవంతం చేయాలని టీఎస్‌సీపీఎస్‌ఈయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రకాంత్ కోరారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో పోస్టర్లను ఆవిష్కరించి, మాట్లాడారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగే యుద్ధభేరి సభకు ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఉదయం 8.45 గంటలకు జిల్లా పరిషత్ గ్రౌండ్ నుంచి బస్సులు బయలు దేరుతున్నట్లు తెలిపారు. నాయకులు మల్లేష్, రాజే ష్‌కుమార్, శ్రీకాంత్, శ్రీనివాస్‌రెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.

విద్యార్థులు సైన్స్‌పై అవగాహన కలిగి ఉండాలి



విద్యార్థుల ప్రదర్శనను పరిశీలిసున్న వాసుదేవ మూర్తి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు సైన్స్‌పై అవగాహన కలిగి ఉండాలని మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవ మూర్తి అన్నారు. శనివారం పట్టణంలోని మౌంట్ బాసిల్ జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా స్కూల్‌లో 354 విభిన్న సైన్స్ ఎక్స్‌పోని ప్రారంభించారు. అంతకు ముందు సీవీ రామన్ చిత్రపటానికి నివాళి అర్పించారు. ప్రాజెక్టులు అద్భుతంగా ఉన్నాయని కొనియాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సోమ శేఖర్, డైరెక్టర్ శిరీష ప్రవీణ్‌కుమార్, చైర్మన్ చంద్రకళ, కరస్పాండెంట్ పూజిత మోహన్‌రెడ్డి, సుశాంత్ కృష్ణ పాల్గొన్నారు.

● మహబూబ్‌నగర్ న్యూటౌన్ : విద్యార్థులు చిన్నప్పటి నుంచే సైన్స్ ప్రయోగాలు చేసి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవ మూర్తి అన్నారు. శనివారం బండమీదిపల్లిలోని సరస్వతి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఫెయిర్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

రుణ పరిమితిని పెంచిన కేంద్రం

హన్వాడ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : రాయితీపై ఇచ్చే పంట రుణాల పరిమితిని పెంచుతున్నట్లు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రకటించారు. శనివారం ప్రధానమంత్రి దేశ వ్యాప్తంగా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మండలంలోని టంకర రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ జిల్లా అధికారి వెంకటేష్, పశు సంవర్ధక అధికారి మధుసూధన్, నాబార్డు బ్యాంక్ అధికారి భాస్కర్ ఇతర శాఖల అధికారులు, రైతులు పాల్గొని ప్రధాన మంత్రి ప్రత్యేక ప్రసారాన్ని వీక్షించారు. ప్రస్తుతం రాయితిపై ఇస్తున్న పంట రుణాలు పరిమితిని రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు, మార్టిగేజ్ లేకుండా ఇచ్చే రుణాలు రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షలకు పెంచుతున్నట్లు ప్రధాన మంత్రి ప్రకటించారు. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

పరిశుభ్రమైన పట్టణంగా తీర్చిదిద్దాలి



పారిశుధ్య కార్మికుల చేత ప్రతిజ్ఞ చేయిస్తున్న మునిసిపల్ కమిషనర్ నురూల్ నజీబ్

భూత్పూర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణాన్ని పరిశుభ్రంగా తీర్చి దిద్ధడమే లక్ష్యంగా ప్రతీ కార్మికుడు పనిచేయాలని మునిసిపల్ కమిషనర్ నురూల్ నజీబ్ సూచించారు. శనివారం భూత్పూర్ మునిసిపాలిటీలోని 4వ వార్డులో నవచైతన్య మహిళా సమాఖ్య, మునిసిపాలిటీ పారిశుధ్య కార్మికులకుతో కలిసి 2025 స్వచ్ఛ అభియాన్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మునిరంగస్వామి ఆలయ పరిధిలోని ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన పారిశుధ్య కార్మికుల సమావేశంలో పాల్గొని, అవగాహన కల్పించారు. అంతకుముందు స్వచ్ఛ అభియాన్ ప్రతిజ్ఞ చేయించారు. కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి లిక్కి విజయ్‌గౌడ్, పాల్గొన్నారు.

శివరాత్రికి ఆర్టీసీ ఆదాయం రూ.88.98 లక్షలు

మహబూబ్‌నగర్ టౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : మహా శివరాత్రి పర్వదినం పురస్కరించుకొని ఫిబ్రవరి 24 నుంచి 27 వరకు మహబూబ్‌నగర్ రీజియన్‌లోని వివిధ డిపోల నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. ఈ బస్సుల ద్వారా దాదాపు రూ.88 లక్షల 98 వేల ఆదాయం చేకూరినట్లు ఆర్‌ఎం సంతోష్‌కుమార్ తెలిపారు. వివిధ డిపోల నుంచి 271 ప్రత్యేక బస్సులు నడిపించినట్లు తెలిపారు. అచ్చంపేట డిపో ఆదాయం రూ.90,9,775, గద్వాల ఆదాయం రూ.7,62,515, కల్వకుర్తి ఆదాయం రూ.6,91,050, కొల్లాపూర్ డిపో ఆదాయం రూ.7,47,030, మహబూబ్‌నగర్ డిపో ఆదాయం రూ.24,51,280, నాగర్‌కర్నూల్ డిపో ఆదాయం రూ.8,97,460, నారాయణపేట డిపో ఆదాయం రూ.9,53,352, షాద్‌నగర్ డిపో ఆదాయం రూ.4,48,420, వనపర్తి డిసో ఆదాయం రూ.10,37,160 వచ్చిందని తెలిపారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

నవాబ్‌పేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని యన్మనగండ్ల ప్రాథమిక పాఠశాలలో శనివారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయలుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు చెప్పి అలరించారు. హెచ్‌ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్న నాటి నుంచి పోటితత్వం అలవర్చుకోవాలని సూచించారు.